సాక్షి రంగారెడ్డి

గురువారం । 13 । జూలై । 2023



మైసిగండికి ఆదాయం

కడ్తాల్ పరిధిలోని మైసిగండి మైసమ్మదేవత ఆలయానికి వేలం పాటల ద్వారా భారీగా ఆదాయం చేకూరింది. 8లో▸



నకిలీ సర్టిఫికెట్లతో..

నకిలీ సర్టిఫికెట్లను సృష్టించి విదేశాలకు వెళ్లేందుకు యత్నిస్తున్న ఓ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. 8లో▸



వసతులు కల్పించాలి

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు పవన్‌చౌహాన్ కోరారు. 8లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల కళాశాల, పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో బోధించేందుకు ఉపాధ్యాయులు కావాలని, ఇందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. మండలంలోని తోల్‌కట్ట సమీపంలో ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలిక కళాశాల, పాఠశాలలో తాత్కాలిక పద్ధతిన ఉపాధ్యాయ, అధ్యాపక ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. మ్యాథ్స్, సోషల్, సైన్స్, లైబ్రేరియన్‌లకు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 79950 10635 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ వరదాచారి

యాచారం: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, విధాన పరిషత్ సమన్వయాధికారి వరదాచారి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సమయానికి వస్తున్నారా, మందులు ఇస్తున్నారా, సేవలు ఎలా ఉన్నాయి అంటూ ఆరా తీశారు. త్వరలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమిస్తామని స్పష్టం చేశారు.

బాల్‌రాజ్‌గౌడ్‌కు రాష్ట్ర పోలీస్ సేవాపతకం



షాద్‌నగర్ రూరల్: షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బాల్ రాజ్‌గౌడ్ విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర పోలీసు సేవాపతకానికి ఎంపికయ్యాడు. పోలీసుశాఖలో 1998లో కానిస్టేబుల్‌గా ఎంపికైన బాల్ రాజ్‌గౌడ్ 2022లో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 11 సంవత్సరాలుగా గ్రేహౌండ్స్‌లో, 14ఏళ్లు శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో కృషి చేశారు. షాద్‌నగర్ డివిజన్‌లో ఐటీ సెల్ విభాగంలో ఉత్తమ సేవలందించి క్రమశిక్షణకు మారు పేరుగా నిలిచారు. రాష్ట్ర పోలీస్ సేవాపతకానికి ఎంపికైన బాల్‌రాజ్‌గౌడ్ రూ. 25వేల నగదు, ప్రశంసాపత్రం, సన్మానం అందుకోనున్నారు. షాద్‌నగర్ డివిజన్‌లో సేవలందిస్తూ పోలీస్ సేవా పతకానికి ఎంపికైనందున బుధవారం బాల్‌రాజ్‌గౌడ్‌కు షాద్‌నగర్ ఏసీపీ కుశాల్కర్, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, పోలీసులు సిబ్బంది అభినందనలు తెలియచేశారు.

16న రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 16న తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ జరగనుంది. లాల్‌బహదూర్ ఇండోర్ స్టేడియంలో జరిగే ఈ టోర్నీని అండర్-7, 9, 11, 13, 15 బాలబాలికల విభాగాల్లో నిర్వహిస్తారు. 1-1-2008న, ఆ తర్వాత జన్మించిన వారు ఈ టోర్నీలో పాల్గొనేందుకు అర్హులు. స్విస్ ఫార్మాట్‌లో మొత్తం అయిదు రౌండ్లపాటు గేమ్‌లు నిర్వహిస్తారు. ప్రతి విభాగంలో టాప్-10లో నిలిచిన వారికి ట్రోఫీలు అందజేస్తామని టీఎస్‌సీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు. ఆసక్తిగలవారు తమ పేర్లను ఈ నెల 14లోపు 73375 78899, 73373 99299లలో సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు.

ముగిసిన ఎయిర్‌పోర్ట్ మెట్రో బిడ్డింగ్ గడువు

సాక్షి, సిటీబ్యూరో: ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టు బిడ్డింగ్ గడువు బుధవారంతో ముగిసింది. పలు జాతీయ, అంతర్జాతీయ నిర్మాణ సంస్థలు టెండర్లను దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకే బిడ్డింగ్ గడువు విధించినప్పటికీ సాంకేతిక అంశాలపైన అధ్యయనం కోసం కొన్ని సంస్థల విజ్ఞప్తి మేరకు ఈ నెల 12 వరకు పొడిగించిన సంగతి తెలిసిందే. రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు 31 కిలోమీటర్ల మార్గంలో మెట్రో నిర్మాణం కోసం గ్లోబల్ టెండర్లను ఆహ్వానించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును దక్కించుకోనున్న సంస్థపై ఒకటి,రెండు రోజుల్లో వివరాలను వెల్లడించే అవకాశం ఉంది. నగరంలో మెట్రో రైలు నిర్మించిన ఎల్ అండ్ టీ సంస్థతో పాటు పలు సంస్థలు పోటీలో ఉన్నాయి.



షాద్‌నగర్: రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



మీర్‌పేట: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పవర్ మంటలు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ ఆందోళనలు

- ప్రధాన కూడళ్లలో పీసీసీ అధ్యక్షుడి దిష్టిబొమ్మలు దహనం
- పలు సబ్‌స్టేషన్ల వద్ద సీఎం దిష్టిబొమ్మల దహనం
- ఒకరిపై ఒకరు విమర్శల పర్వం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య పవర్ మంటలు మండుతున్నాయి. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్ చేసిన వ్యాఖ్యలపై అధికార బీఆర్‌ఎస్ మండిపడుతుండగా.. 24 గంటల ఉచిత కరెంట్ పేరుతో ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని పేర్కొంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ ఆందోళనకు దిగింది. ఆయా చౌరస్తాల్లో బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయగా కాంగ్రెస్ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాలాపూర్ సబ్‌స్టేషన్, కందుకూరు సబ్‌స్టేషన్ల ముందు ఆయా ప్రాంతాల నేతలు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నినాదాలతో హోరెత్తించారు. ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించారు.

ఆ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ వద్దని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. రైతు సంతోషంగా ఉండటం కాంగ్రెస్‌కు ఇష్టం లేనట్టుంది. ఒక వైపు బీజేపీ బావుల దగ్గర మోటార్లకు మీటర్లు అంటోంది. మరో వైపు కాంగ్రెస్ 24 గంటల ఉచిత విద్యుత్ వద్దు అంటోంది. గతంలో 7 గంటల విద్యుత్‌తో రైతులు పాము కాటు, విద్యుత్ షాక్‌తో చనిపోయేవారు. నేడు 24 గంటల ఉచిత విద్యుత్‌తో ప్రమాదాలకు దూరం అయ్యారు. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత విద్యుత్‌తో తెలంగాణ దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మారింది.

– సబితా రెడ్డి, విద్యాశాఖ మంత్రి

ఉచిత విద్యుత్ పేరుతో మోసం

ఉచిత విద్యుత్ పేరుతో రైతులను మోసం చేస్తుంది కేసీఆరే. రాష్ట్రంలో ఎక్కడా 24 గంటల విద్యుత్ సరఫరా కావడం లేదు. కనీసం 12 గంటలు కూడా ఇవ్వడం లేదు. తొమ్మిదేళ్లలో విద్యుత్ సంస్థలను రూ.60 వేల కోట్ల అప్పుల్లో ముంచేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. పీసీసీ చీఫ్ రేవంత్ వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ నేతలు వక్రీకరిస్తున్నారు. ఉచిత విద్యుత్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రవేశపెట్టింది. కేసీఆర్ నియంతృత్వ పాలనను అంతం చేయడమే కాంగ్రెస్ లక్ష్యం. కాంగ్రెస్ చేపట్టిన సత్యాగ్రహ దీక్షను నీరుగార్చేందుకు బీఆర్‌ఎస్ కుట్రపన్నింది.

– చల్లా నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ముందుండాలి

- అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్వచ్ఛ సర్వేక్షణ్ -2023 పోటీల్లో జిల్లాను జాతీయ స్థాయిలో ముందుండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులు, ఎంపీడీవోలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షన్‌పై బుధవారం రాష్ట్రస్థాయిలో జరిగిన జూమ్ మీటింగ్‌లో ఆయన జెడ్పీ సీఈఓ, సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ సురేష్, ఇప్సాస్ సంస్థ ప్రతినిధి వివేక్ స్వచ్ఛ సర్వేక్షణ్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరిశీలన వివరాలను వెల్లడించారు. అనంతరం జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్ పంచాయతీ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎంపీఓలు, ఎంపీడీవోలను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని ప్రతి పంచాయతీలో తడి పొడి చెత్త వేరు చేయడం, సేకరణ, షెడ్ వినియోగం, ఎరువుల తయారీ, ప్లాస్టిక్ తగ్గింపు, మరుగుదొడ్ల వినియోగం, చేతుల పరిశుభ్రత, అన్ని సంస్థల్లో మరుగుదొడ్ల సౌకర్యం, ఇంకుడు గుంతల ఏర్పాటు తదితరాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సంపూర్ణ పారిశుద్ధ్యం- సమగ్ర ఆరోగ్యానికి నాంది అని తెలియజేస్తూ ఈనెల 15 నుంచి జరిగే స్వచ్ఛత- పరిశీలన (స్వచ్ఛ సర్వేక్షణ్)కు సమాయత్తం కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్, డీపీఓ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవోలు, ఎంపీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

గా పిల్ల మోసం చేసింది.. ఉండలేక పోతున్న..



మహేశ్ (ఫైల్)

శంకర్‌పల్లి/చేవెళ్ల: 'ప్రేమించిన అమ్మాయి విడిచిపెట్టి పోయింది.గా పిల్ల నన్ను ఘోరంగా మోసం చేసింది. ఇక నేను ఉండలేక పోతున్న' అంటూ అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థి సెల్ఫీ వీడియో ద్వారా తన సోదరుడికి సమాచారం అందించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం అల్లాపూర్‌కు చెందిన కురువ మహేశ్(21) నగరంలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్నాడు. ఓ అమ్మాయితో ప్రేమ విఫలమై ఇద్దరి మధ్య అగాధం పెరిగింది. ఏం జరిగిందో కానీ ప్రియురాలు తనను విడిచిపెట్టి పోయిందని తీవ్ర మనస్తాపం చెందాడు. దీన్ని జీర్ణించుకోలేకపోయాడు. చివరికి చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని పట్టాలపైకి వెళ్లి సెల్ఫీ వీడియో ద్వారా అన్నకు ఈ విషయం చెప్పాడు. ఇక తాను ఉండలేనని, అమ్మానాన్నలను మంచిగా చూసుకోవాలి.. ఇక పోతా అంటూ గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల మొండెం రెండు ముక్కలై మృతదేహం ఛిద్రమైంది. అతని వద్ద మల్లారెడ్డి యూనివర్సిటీ ఐడీ కార్డు ఉంది. ప్రయోజకుడు అవుతాడనుకున్న కొడుకు అర్ధంతరంగా తనువు చాలించటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రమతో గెలిచి..

- సీఎం కేసీఆర్ కలను ఐపీఎస్‌లు సాకారం చేశారు



మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

సాక్షి, సిటీబ్యూరో/బంజారాహిల్స్: రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారులు పగలూ, రేయీ శ్రమించి శాంతి భద్రతలను పరిరక్షిస్తూ సీఎం కేసీఆర్ కలను సాకారం చేశారని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణనే మహిళలకు ఎక్కువ సేఫ్ అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ) బుధవారం 'షీ ట్రంప్స్ విత్ రెస్పెక్ట్, ఈక్వాలిటీ అండ్ ఎంపవర్‌మెంట్' (స్త్రీ) పేరిట నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (ఐసీసీసీ) ఉన్న ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. 'స్త్రీ' సదస్సు అతివలకు ఎంతో ఉపయుక్తమన్నారు. మహిళల భద్రత అంశంలో సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. హెచ్‌సీఎస్‌సీతో పాటు హైదరాబాద్ పోలీసులు మహిళల భద్రత కోసం అనేక చర్యలు తీసుకుంటున్నారని, నగరాన్ని సేఫ్ సిటీగా మారుస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తీసుకున్న అనేక వినూత్న, వేగవంతమైన చర్యలు నగర పోలీసింగ్ స్వరూప స్వభావాలనే మార్చేస్తున్నాయని, మహిళల రక్షణకు ఆయన పెద్దపీట వేస్తున్నారని కితాబిచ్చారు.

'స్త్రీ' ఓ మైలురాయి..

నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. 'హెచ్‌సీఎస్‌సీ ప్రస్థానంలో 'స్త్రీ' ఓ మైలురాయి. అతివల కోసం తెలంగాణ ప్రభుత్వం ఆది నుంచీ అనేక భద్రతా చర్యలు తీసుకుంటోంది. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు 176 ఏళ్ల చరిత్ర ఉంది. తొలిసారిగా 2022లోనే ఓ మహిళకు లా అండ్ ఆర్డర్ స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ వచ్చింది. లాలాగూడ ఠాణాకు మధులత పోస్టింగ్‌తో మొదలు పెట్టి ఇప్పటి వరకు నలుగురిని ఇలా నియమించాం. ఈ కోణంలోనూ మహిళా సాధికారత కోసం సిటీ పోలీసు విభాగం కృషి చేస్తోంది. యువత ముందుకు వచ్చి హెచ్‌సీఎస్‌సీలో వలంటీర్లుగా చేరాలి' అని పేర్కొన్నారు.

నగర పోలీసింగ్ సూపర్..

ఢిల్లీ, ముంబై నగరాల్లో మగువల భద్రత విషయంతో పోలిస్తే తెలంగాణ పోలీసింగ్ అద్భుతంగా ఉందని, చాలా బాగా పనిచేస్తున్నారని సినీనటి ఫరియా అబ్దుల్లా అన్నారు. స్త్రీ సమిట్- 2023లో ఆమె సాయంత్రం సెషన్‌లో పాల్గొని మాట్లాడుతూ.. ఇక్కడ మహిళల భద్రత, రక్షణకు పెద్దపీట వేస్తున్నారని అభినందించారు. షీటీమ్స్ లాంటి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అతివలకు అవసరమైన భద్రత, భరోసాను కల్పించడంలో హైదరాబాద్ పోలీసులు ముందున్నారన్నారు.

వీడియో తీసి.. సోషల్ మీడియాలో పెట్టి..
మహమూద్ అలీ, హోంమంత్రి

'ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ మహిళ నగరానికి వచ్చారు. ట్యాక్సీ ఎక్కి ఆ డ్రైవర్‌ను సమీపంలోని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లమన్నారు. అతడు పంజగుట్ట ఠాణాకు తీసుకుపోగా.. లోపలకు వెళ్లిన ఆమె తన సెల్‌ఫోన్ పోయిందని ఫిర్యాదు చేశారు. అది పోకపోయినా కేవలం పోలీసుల స్పందన తెలుసుకోవడానికే ఇలా చేశారు. పోలీసుస్టేషన్ నుంచి బయటకు వచ్చిన ఆమె తన అనుభవాన్ని చెబుతూ దేశంలోని మరే ఇతర నగరంలోనూ ఇలాంటి స్పందన, బాధ్యతాయుతమైన పోలీసింగ్ చూడలేదని వ్యాఖ్యానిస్తూ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఓ మీడియా మిత్రుడు ఆ వీడియో నాకు షేర్ చేశారు. ఇది చూసి ఎంతో గర్వించా. బుధవారం ఉదయం జరిగిన ఓ సమావేశంలో కలిసిన ఢిల్లీ అధికారులు సైతం నగరానికి కితాబిచ్చారు.

బోధన సాగేదెలా?

- 70 శాతం మించని పాఠ్యపుస్తకాల సరఫరా
- నోటు పుస్తకాలు, వర్క్‌బుక్స్ అరకొరగానే
- ఇప్పటికీ అందని రెండు సబ్జెక్టుల పుస్తకాలు
- గ్రేటర్ పరిధి సర్కారు బడుల్లో ఇదీ పరిస్థితి



సాక్షి, సిటీబ్యూరో: ఈసారి కూడా సర్కారు బడుల విద్యార్థులను పాఠ్యపుస్తకాల కొరత వెంటాడుతూనే ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు దాటినా.. పూర్తి స్థాయిలో అందని పరిస్థితి నెలకొంది. సుమారు 30 శాతం మంది విద్యార్థులు పాఠ్య పుస్తకాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నోట్ పుస్తకాలతోపాటు వర్క్ బుక్స్ పంపిణీ అంతంత మాత్రంగా తయారైంది. ప్రింటింగ్ ప్రెస్ నుంచి నగరంలోని రామంతాపూర్ పాఠపుస్తకాల గోదాముకు హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు సంబంధించి సుమారు 70 నుంచి 80 శాతం వరకు స్టాక్ వచ్చి చేరినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠశాలల ప్రారంభానికి ముందే స్కూల్ పాయింట్లకు సరఫరా జరగడంతో వాటిని విద్యార్థులకు అప్పగించారు.

ఇంకా 30 శాతం దూరమే..

ప్రభుత్వ బడుల్లోని సుమారు 30 శాతం విద్యార్థులు పాఠ్యపుస్తకాలు అందలేదు. దీంతో తోటి విద్యార్థుల పుస్తకాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. హైదరాబాద్-రంగారెడ్డి-మేడ్చల్ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ బడుల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సుమారు 33.98 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా.. గోదాంకు 23.78 లక్షలు మాత్రమే వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకు కనీసం 70 శాతం పాఠ్య పుస్తకాలు సరఫరాకు నోచుకున్నాయి. పాఠశాలల్లో వాటిని పంపిణీ చేసినా.. పూర్తి స్థాయి ఇండెంట్ చేరలేదు. కొన్ని తరగతుల రెండు మూడు సబ్జెక్టుల పుస్తకాలు అందలేదని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు.

పాఠ్య పుస్తకాలు ఇలా..

- హైదరాబాద్ జిల్లాలో మొత్తం 691 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా విద్యార్థులు 1,14,607 మంది ఉన్నారు. వీరి సంఖ్యకు అనుగుణంగా సుమారు 14 లక్షల వరకు పాఠ్యపుస్తకాలు అవసరం. అందులో ఇప్పటి వరకు 12 లక్షల పుస్తకాలు మాత్రమే గోదాంలకు వచ్చాయి. మరో 2 లక్షల పాఠ్య పుస్తకాలు రావాల్సింది.
- రంగారెడ్డి జిల్లా పరిధిలో 1308 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో 1.78 లక్షల మంది విద్యార్థులున్నారు. ఇందుకోసం 13.56 లక్షల పుస్తకాలు అవసరం. మొదటి విడతగా 10.09 లక్షలకుగాను 9.31 లక్షల పాఠ్యపుస్తకాలు గోదాంకు వచ్చాయి. ఇందులో 7.70 లక్షల పుస్తకాలను పాఠశాలలకు సరఫరా చేశారు.
- మేడ్చల్ జిల్లా పరిధిలోని 515 ప్రభుత్వ పాఠశాలల్లో 98,733 మంది చదువుతున్నారు. సుమారు 6.39 లక్షల పుస్తకాలు అవసరం. ఇప్పటి వరకు 4.08 లక్షల పుస్తకాలను మాత్రమే విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఆర్థిక భారం తగ్గేలా..

- నూతన పథకాన్ని ప్రవేశపెట్టిన ఆర్టీసీ
- మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం 'టీ-9'
- రూ.100 చెల్లించి కొనుగోలు చేసే అవకాశం
- కాంబీ టికెట్‌తో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ తిరుగు ప్రయాణం



షాద్‌నగర్ డిపోలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు (ఫైల్)

షాద్‌నగర్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గించేందుకు ఆర్టీసీ మరో నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. బస్సుల్లో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం టీ-9 టికెట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పథకంతో మహిళలు, వృద్ధులకు కొంత వరకు ఆర్థిక భారం తగ్గుతుంది. ఇప్పటివరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి కోసం టీ-6, ఎఫ్-24, టీ-24 టికెట్లను విక్రయిస్తోంది. తాజాగా జిల్లాల పరిధిలోని గ్రామీణ, పట్టణ ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని వారి సౌకర్యార్థం టీ-9 టికెట్ అనే కొత్త పథకానికి రూపకల్పన చేసింది. గత నెల 18న ప్రారంభమైన ఈ పథకానికి ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

మహిళలు, సీనియర్ సిటిజన్లకు మాత్రమే..

టీ-9 టికెట్‌ను 18 ఏళ్లు నిండిన మహిళలు, 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లు కొనుగోలు చేసేందుకు అర్హులు. ఈ పథకం ద్వారా ఒక్కో ప్రయాణికుడికి రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతాయని సంస్థ అధికారులు తెలిపారు. 60ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు వయస్సు ధ్రువీకరణ, ఆధార్ కార్డును పల్లె వెలుగు బస్సులో కండక్టర్లకు చూపించి వంద రూపాయలు చెల్లించి టికెట్‌ను పొందొచ్చు. ఈ టికెట్ కొనుగోలు చేసే వారికి టోల్‌గేట్ చార్జీలపై మినహాయింపు ఉంటుంది. ఇది రాష్ట్ర పరిధిలోనే చెల్లుబాటు అవుతుంది. గ్రామీణ, పట్టణ ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

కాంబీ టికెట్‌తో ఎక్స్‌ప్రెస్‌లోనూ..

టీ-9 టికెట్‌తో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే వెసులుబాటును సంస్థ కల్పించింది. పల్లె వెలుగు బస్సుల్లో రూ.100 చెల్లించి టికెట్ కొనుగోలు చేసిన వారు తిరుగు ప్రయాణంలో ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణించాలనుకుంటే అదనంగా రూ.20 చెల్లించి కాంబీ టికెట్‌తో కొనుగోలు చేయాల్సి ఉంటుంది. తిరుగు ప్రయాణంలో మాత్రమే కాంబీ టికెట్ వర్తిస్తుందని అధికారులు తెలిపారు. కాంబీ టికెట్ ఈనెల 9 నుంచి అమల్లోకి వచ్చింది.

రాత్రి 9గంటల వరకు

పథకం పథకం ప్రారంభించినప్పుడు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఈ టికెట్ చెల్లుబాటయ్యేది. ప్రయాణికుల విజ్ఞప్తుల మేరకు ప్రస్తుతం రాత్రి 9 గంటల వరకు పెంచుతూ సంస్థ నిర్ణయం తీసుకుంది. ఈ టికెట్ ద్వారా 60 కిలోమీటర్ల పరిధిలో ఒక్కసారి రానుపోను ప్రయాణం చేయొచ్చు.

డబ్బులు ఆదా..



ఇందనం ధర పెరుగుదలతో ప్రయాణం రోజురోజుకూ భారం అవుతోంది. ఈ తరుణంలో ఆర్టీసీ పల్లె వెలుగుల్లో ప్రయాణించే వారి కోసం తెచ్చిన టీ-9 టికెట్‌తో ప్రయాణ ఖర్చులు తగ్గుతున్నాయి.

– సయ్యద్ రసూల్, షాద్‌నగర్

మహిళలకు ప్రాధాన్యత భేష్



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఆర్థిక భారం తగ్గించే విధంగా సంస్థ టికెట్లు విక్రయించడం అభినందనీయం. బస్సుల్లో ప్రయాణించే పేదలకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

– గౌతమి, షాద్‌నగర్

సద్వినియోగం చేసుకోవాలి



వృద్ధులు, మహిళల కోసం ఆర్టీసీ టీ-9 టికెట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హులైన వారు బస్సులో నేరుగా కండక్టర్ల వద్ద టికెట్ కొనుగోలు చేయొచ్చు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఉష, డీఎం, షాద్‌నగర్ డిపో


రైతు సంక్షేమానికి సర్కార్ పెద్దపీట

వ్యవసాయ సహకార కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రాజావరప్రసాద్

షాద్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వ్యవసాయ సహకార కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ రాజావరప్రసాద్ అన్నారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతు విధానాలు అమలవుతున్నాయని, రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. వ్యవసాయ రంగానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కరెంటు, నీళ్లు ఇస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు కళ్లలో కారం పోసుకుంటున్నారని మండిపడ్డారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తే కాంగ్రెసోళ్లు ఓర్వలేక పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ సక్రమంగా లేక ఎంతో మంది రైతులు ప్రాణాలను పోగొట్టుకున్నారని తెలిపారు. రాహుల్‌గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్ ఓ బోగస్ అని పేర్కొన్నారు. ప్రజల కష్టాలను పట్టించుకోని కాంగ్రెస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నెలరోజుల్లో ధరణి సమస్యలకు పరిష్కారం

- మండలాల వారీగా దరఖాస్తుల క్లియరెన్స్
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: అపరిష్కృతంగా ఉన్న ధరణి సమస్యలను నెలరోజుల్లో పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ హరీశ్‌తో సమావేశమైన ఆయన.. పలు సమస్యలపై చర్చించినట్లు చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ధరణి సమస్యలను కలెక్టర్‌తో చర్చించానని, వాటి పరిష్కారానికి శరవేగంగా చర్యలు చేపట్టాలని సూచించినట్లు చెప్పారు. ముందుగా యాచారం మండలం మల్కీజ్‌గూడ నుంచి పరిష్కార చర్యలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. నందివనపర్తి రెవెన్యూ పరిధి నుంచి మల్కీజ్‌గూడ విడిపోయినప్పటికీ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ రైతులకు పాత పాసుబుక్కులు ఇచ్చి చేతులు దులుపుకొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రత్యేక రెవెన్యూ విలేజ్‌గా మల్కీజ్‌గూడను గుర్తించకపోవడంతో ఆన్‌లైన్‌లో భూరికార్డుల సమస్యలు తలెత్తినట్లు వివరించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వారం రోజుల్లో మల్కీజ్‌గూడ సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తర్వాత యాచారం మండలం ధరణి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. అలాగే.. నియోజకవర్గంలోని మిగిలిన మండలాల సమస్యల పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. భూ సమస్యలుంటే వెంటనే మీ సేవలో దరఖాస్తులు చేసుకోవాలని, మరేమైన ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే చెప్పారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఎంపీపీలు కృపేశ్, నర్మద, జెడ్పీటీసీ జంగమ్మలు ఉన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో విదేశాలకు వెళ్లేందుకు యత్నం

విద్యార్థి అరెస్టు.. సర్టిఫికెట్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నకిలీ సర్టిఫికెట్లతో నిందితుడు కార్తీక్

అబ్దుల్లాపూర్‌మెట్: నకిలీ సర్టిఫికెట్లను సృష్టించి విదేశాలకు వెళ్లేందుకు యత్నిస్తున్న ఓ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడకు చెందిన గుడిదేవుని దయానంద్‌గౌడ్ కుమారుడు గుడిదేవుని కార్తీక్‌గౌడ్ (24)కు విదేశాల్లో చదువుకోవాలన్న ఆలోచన ఉన్నప్పటికీ సరైన విద్యార్హత లేదు. దీంతో అతని దృష్టి నకిలీ సర్టిఫికెట్లపై మళ్లింది. తిరుపతిలో కన్సల్టింగ్ నిర్వహిస్తున్న గిరి అనే వ్యక్తితో పరిచయం చేసుకున్నాడు. అతని ద్వారా ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన చౌదరి చరణ్‌సింగ్ యూనివర్సిటీకి చెందిన నకిలీ బీటెక్ సర్టిఫికెట్లను పొందాడు. ఇందుకుగాను రూ.2.60లక్షలు చెల్లించాడు. నకిలీ సర్టిఫికెట్లతో కార్తీక్ విదేశాలకు వెళ్లేందుకు యత్నిస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారాన్ని తెలుసుకున్న ఎల్బీనగర్ జోన్ ఎస్‌ఓటీ బృందం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల సహకారంతో కార్తీక్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతను నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం బయటపడింది. దీంతో కార్తీక్ నుంచి ఐదు నకిలీ సర్టిఫికెట్లను, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న తిరుపతికి చెందిన కన్సల్టెన్సీ నిర్వాహకుడు గిరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్‌గా 'గోలి'!



గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: ఆహార కమిషన్ చైర్మన్‌గా కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డిని నియమించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు రెండుమూడు రోజులలో ఉత్తర్వులు వెలువడనున్నాయని తెలిసింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో పాల్గొని అనంతరం బీఆర్‌ఎస్‌లో చురుకుగా పనిచేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి సేవలను ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించారు. దశాబ్దకాలంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఏ పదవి రాకున్నా కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో శ్రీనివాస్‌రెడ్డి చురుకుగా పనిచేస్తున్నారు. కల్వకుర్తి టికెట్‌ను కూడా ఆశిస్తూ పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆహార కమిషన్ చైర్మన్‌గా గోలి శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తున్నట్లు సీఎంఓ కార్యాలయం నుంచి సమాచారం వచ్చినట్లు సమాచారం. రాజ్యాంగబద్ధ చైర్మన్ పదవిని తీసుకోవడానికి గోలి శ్రీనివాస్‌రెడ్డి సుముఖంగా లేకపోయినప్పటికీ పార్టీ పెద్దల సలహాతో అంగీకరించినట్లు తెలిసింది. ఆహార కమిషన్ చైర్మన్‌గా గోలి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మరో ఐదుగురు సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం గవర్నర్‌కు సిఫార్సు చేసినట్లు సమాచారం. ఐదేళ్లపాటు ఆహార కమిషన్ చైర్మన్ పదవి ఉంటుంది.

విద్యుత్ కుంభకోణాలను వెలికితీస్తాం

- పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్
- విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ ధర్నా



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న వీర్లపల్లిశంకర్ తదితరులు

షాద్‌నగర్‌రూరల్: విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాల్పడిన అవినీతి, కుంభకోణాలను వెలికితీసే వరకు కాంగ్రెస్ విశ్రమించదని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించి మాట్లాడటం సరికాదన్నారు. సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, రుణమాఫీ, వ్యవసాయ పనిముట్లు వంటి పథకాలకు తిలోదకాలిస్తూ రైతులను నట్టేట ముంచిందని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ ఉచిత విద్యుత్‌పైనే తొలి సంతకం చేసి రైతుల పక్షపాతిగా నిలిచిన విషయం గుర్తు చేశారు. విద్యుత్ కొనుగోలులో జరిగిన అవినీతిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, మీరు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వణుకు పుడుతుందని అన్నారు. ప్రధాని మోదీ తీసుకొచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు మద్దతు ఇచ్చిన కేసీఆర్ సర్కార్‌కు రైతుల గురించి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటుగా రుణమాఫీ, మద్దతు ధర వంటి అనేక పథకాలను అమలు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కె.చెన్నయ్య, పీసీసీ సభ్యుడు మహ్మద్‌అలీ బాబర్‌ఖాన్, నాయకులు రఘు, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, అందెమోహన్, శ్రీశైలం, సుదర్శన్, ఖదీర్, పుల్లారెడ్డి, నాగమణి, బసప్ప, సాయిలు, శ్రీనునాయక్, అశోక్, నవీన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి రిమాండ్



నిందితుడు పంకజ్‌కుమార్, స్వాధీనం చేసుకున్న గంజాయి

ఇబ్రహీంపట్నం: అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న యువకున్ని పట్టుకుని బుధవారం పోలీసులు రిమాండ్‌కు తరలించిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎల్బీ నగర్ జోన్ ఎస్‌ఓటీ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రాత్రి శేరిగూడలో అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న పంకజ్ కుమార్(23)ను పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 500 గ్రాముల గంజాయిని, మొబైల్ ఫోన్, రూ. 4,730 నగదును స్వాధీనం చేసుకున్నారు. బీహార్ రాష్ట్రానికి చెందిన నిందితుడు శేరిగూడలోని బ్యాంక్ కాలనీలో నివాసముంటున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

గృహిణి అదృశ్యం



మధుమిత (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సీహెచ్. వెంకటేశ్వర్లు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన తపస్ కుమార్ గిరి, మధుమిత డగారా(22) ఏడాది క్రితం జల్‌పల్లి శ్రీరాం కాలనీకి వలస వచ్చారు. స్థానికంగా ఉన్న పేపర్ ప్లేట్ల తయారీ కంపెనీలో మధుమిత పని చేస్తోంది. 10వ తేదీన అనారోగ్యంగా ఉందని ఇంటి వద్దే ఉన్న మధుమిత.. మధ్యాహ్నం సమయంలో జ్యూస్ తీసుకొస్తానని బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమెతో పాటు కంపెనీలో పనిచేసే బినేష్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసినవారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

దంపతులకు తీవ్రగాయాలు

అబ్దుల్లాపూర్‌మెట్: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా అర్వపల్లికి చెందిన ఈశమల్ల రవి తన భార్య సంధ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై అబ్దుల్లాపూర్‌మెట్‌లోని తన బంధువుల ఇంటికి వస్తున్నారు. బుధవారం సాయంత్రం మార్గమధ్యలో వెనుక నుంచి వచ్చిన మారుతీ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న దంపతులకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైసిగండికి భారీగా ఆదాయం



మైసిగండి ఆలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మదేవత, శివాలయం, రామాలయాలకు వేలంపాట ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. ప్రాంగణంలో 2023–24 సంవత్సరానికి గాను కొబ్బరికాయల విక్రయం, వాహన పూజ రసీదు రుసుం వసూలు చేసుకునే హక్కులకు సంబంధించి బుధవారం వేలం పాట నిర్వహించారు. దేవాలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీ, ఈవో స్నేహలత, సూపర్‌వైజింగ్ అధికారి మురళీకృష్ణ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. మైసిగండికి చెందిన రామావత్ అమృనాయక్ వేలం పాట పాడి రూ.38,91 లక్షలకు కైవసం చేసుకున్నాడు. వాహన పూజ రసీదు రుసుం వసూలు చేసుకునే హక్కులకు రూ.12,42 లక్షలకు మైసిగండికి చెందిన కేతావత్ పరంసింగ్ వేలం పాడి సొంతం చేసుకున్నాడు.

ఉచిత విద్యుత్ పేరిట దగా

- ప్రభుత్వంపై డీసీసీ అధ్యక్షుడు చల్లా ధ్వజం
- విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీఎం దిష్టిబొమ్మ దహనం

మీర్‌పేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ పేరుతో రైతులను అన్ని విధాల మోసం చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. బుధవారం మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసిందని విమర్శించారు. రైతుల అవసరాలు, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కరెంట్ చార్జీలు పెంచే యోచన వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థలను రూ.60 వేల కోట్లు అప్పులో ముంచిన ఘనుడని ధ్వజమెత్తారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ తమ అవినీతి అక్రమాలు, వైఫల్యాలు కప్పి పుచ్చుకునేలా వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని, అలాంటప్పుడు ఎలా రద్దు చేస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా కనీసం 12 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు. కేసీఆర్ నియంతృత్వ పాలన అంతం చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొన్నారు. సత్యాగ్రహ దీక్షను నీరుగార్చేందుకు బీఆర్‌ఎస్ ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శులు అమరేందర్‌రెడ్డి, బంగారు బాబు, మీర్‌పేట్ కార్పొరేటర్లు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, జిల్లా కార్యదర్శి ఎరుకల వెంకటేశ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ నిమ్మల వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దొరికిన 'నేపాల్' దొంగలు?

వ్యాపారి ఇంట్లో చోరీ కేసులో నగదు, నగలు స్వాధీనం

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం రేకెత్తించిన వ్యాపారి ఇంట్లో దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 10వ తేదీన పీజీ రోడ్ జవహర్‌నగర్‌లోని రాహుల్ గోయల్ ఇంట్లో పనిచేసే వాచ్‌మెన్ దంపతులు బంగారం, వెండి, వజ్రాభరణాలతో పాటు రూ.49 లక్షల నగదును ఎత్తుకుని పరారు కావడం తెలిసిందే. ఫిర్యాదు అందుకున్న వెంటనే రాంగోపాల్‌పేట్ పోలీసులు గాలింపు చేపట్టారు.

పథకం ప్రకారం దొంగతనం

నేపాల్‌కు చెందిన కమల్, అతని భార్య పార్వతిలు గత ఐదేళ్ల క్రితం రాహుల్ గోయల్ నివాసం ఉండే ఓం టవర్స్‌లో వాచ్‌మెన్‌గా కుదిరాడు. ఐదేళ్ల నుంచి అందరితో నమ్మకంగా ఉండే కమల్ అదను కోసం ఎదురుచూస్తూ రాహుల్ గోయల్ కుటుంబం రిసార్ట్‌కు వెళ్లడాన్ని గమనించి పథకం ప్రకారమే దొంగతనానికి పాల్పడ్డారు. తన సోదరుడుతో పాటు మరో ముగ్గురిని పిలిపించుకున్నాడు. అందరూ కలిసి ఇంట్లో తాళాలు పగులగొట్టి బంగారం, వెండి, నగదుతో పరారయ్యారు. హైదరాబాద్ నుంచి ఓ ప్రైవేటు బస్సులో మహారాష్ట్రలోని మాథురా చేరుకున్నారు. అక్కడి నుంచి కమల్, ఆయన భార్య, అతని తమ్ముడు, ఇద్దరు పిల్లలు అక్కడే ఉండగా మిగతా కొంత మంది నిందితులు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు.

మూడు నెలల క్రితమే మొబైల్ నంబర్ మార్చిన నిందితుడు

అదను కోసం వేచిచూస్తున్న నిందితుడు గత మూడు నెలల క్రితమే తన మొబైల్ నంబర్‌ను మార్చాడు. కానీ మూడు నెలల నుంచి అక్కడే విధులు నిర్వహిస్తున్నా అపార్ట్‌మెంట్‌లో ఉండే ఏ ఒక్కరి దగ్గర కొత్త మొబైల్ నంబర్ లేకపోవడం గమనార్హం. దొంగతనం చేసిన తర్వాత కూడా మళ్లీ నంబర్లు మార్చి పరారయ్యాడు.

మాథురా బస్టాండ్‌లో పట్టుబడ్డ నిందితులు?

మహారాష్ట్రలోని మాథురా బస్టాండ్‌లో కమల్, ఆయన భార్య, తమ్ముడు, ఇద్దరు పిల్లలు బస్సులో వెళ్లేందుకు వేచి చూస్తున్నారు. అదే సమయంలో పోలీసులు వీరిని చుట్టుముట్టడంతో కమల్ అక్కడి నుంచి పరారయ్యాడు. మిగతా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాత మరో చోట ప్రధాన నిందితుడు కమల్ కూడా పట్టుబడినట్లు తెలిసింది. నిందితులను అక్కడి నుంచి నగరానికి తరలిస్తున్నారు. వారి నుంచి ఆభరణాలు, నగదు కొంత మేరకు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

నేపాల్ వాసుల విచారణ

నిందితుల కోసం రాంగోపాల్‌పేట్ పోలీసులు కొందరు నేపాల్ వాసులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. పీజీ రోడ్, సింధీ కాలనీ, జవహర్‌నగర్ తదితర ప్రాంతంలో నివాసం ఉంటూ, విధులు నిర్వహిస్తున్న నేపాల్‌కు చెందిన వారందరిని పోలీసులు పిలిపించి నిందితుల గురించి ఆరాతీశారు. కానీ నిందితులు ఎవరితో పెద్దగా సంబంధం లేనట్లు తెలిసింది. నేపాల్ వాసుల వివరాలను మొత్తం సేకరించారు.

మౌలిక వసతులు కల్పించాలి

- ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు పవన్‌చౌహాన్ డిమాండ్
- వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ విజయవంతం



పోలీసుల అదుపులో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు

షాద్‌నగర్‌రూరల్: విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు బీఆర్‌ఎస్ సర్కార్ చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు పవన్‌చౌహాన్ డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివ ఆధ్వర్యంలో పట్టణంలో విద్యాసంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా పోలీసులు వామపక్ష విద్యార్థి సంఘం నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారు మాట్లాడుతూ...రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలతో పాటుగా యూనిఫామ్స్‌ను అందించాలని కోరారు. జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు ప్రతిరోజు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు యూనివర్సిటీలలో వీసీలను నియమించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని. సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలను నిర్మించి అన్ని వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు,. ప్రభుత్వానికి విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. బంద్ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు నరేష్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు యాదగిరి, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.